క్లుప్తంగా

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


భక్తిగీతాలు ఆలపిస్తున్న అనూషా

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా స్థానిక మూడు లాంతర్ల జంక్షన్ వద్ద ఉన్న అమ్మవారి చదురుగుడి ఆవరణలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనూషా కేదారిశెట్టి ఆలపించిన భక్తిగీతాలు, లక్ష్మీ కల్యాణి బుర్రకథ దళం బుర్రకథ ప్రదర్శన ఆద్యంతం అలరించాయి. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పైడితల్లి అమ్మవారి వనంగుడి ఆవరణలో నిర్వహించిన కొంకెపూడి అనూరాధా రామాయణ గానం, రెడ్డి ఆదినారాయణ, సన్యాసినాయుడుల ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను ఆలయ అధికారులు సత్కరించారు.

సీఎస్ఈఏఐ బ్రోచర్ ఆవిష్కరణ

డెంకాడ: జొన్నాడ దగ్గరున్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటింగ్ ఫర్ సైన్స్ ఇంజినీరింగ్, స్ప్రింగర్ అంతర్జాతీయ కాన్ఫరెన్స్(సీఎస్ఈఏఐ)-2023 బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. లెండి ఇంజినీరింగ్ కళాశాల, స్కోపస్ ఇండెక్స్ స్ప్రింగర్ స్టేట్ ప్రోమ్స్, అమెరికాకు చెందిన కెలిఫోర్నియా సహకారంతో కంప్యూటింగ్ కొరకు సైన్స్, ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ విధంగా ఉపయోగపడతాయన్న అంశంపై జరుగుతున్న పరిశోధనలకు గాను నిబంధనలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్గనేజింగ్ చైర్‌గా, ఎడిటర్‌గా ఎస్.బోసుబాబు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.రామారెడ్డి, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంగీతంపై మక్కువ పెంచుకోవాలి

- సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్


జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంగీత దర్శకుడు సురేష్

విజయనగరం టౌన్: సంగీతంపై ప్రతిఒక్కరూ మక్కువ పెంచుకోవాలని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ అన్నారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అకాడమీ ద్వారా ఎంతోమంది విద్యార్థులు సంగీత రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం నాదారాధన పేరిట నిర్వహించిన సంగీత పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ డీవీ శ్రీకాంత్, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు ఐ.కృష్ణకాంతి, అకాడమీ ప్రిన్సిపాల్ రవి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

విజయనగరం క్రైమ్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని, నగరంలోని మూడు లాంతర్ల జంక్షన్‌లో జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కోట జంక్షన్ వరకు జరిగిన ర్యాలీలో ఎస్పీ ఎం.దీపికా పాటిల్ పాల్గొని, కోట వద్ద పోలీస్ అమరవీరులకు ఘననివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌస్, ర్యాలీలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలను, మెడికల్ క్యాంప్‌లు నిర్వహించామన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు, పోలీసులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, సెబ్ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, డి.విశ్వనాథ్, యూనివర్స్, సీఐలు బి.వెంకటరావు, ఎస్.హెచ్.విజయానంద్, ఇ.నరసింహమూర్తి, బుచ్చిరాజు, టి.వి.తిరుపతిరావు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం తయారీపై అధికారుల సంతృప్తి


లడ్డూల తయారీని పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి

విజయనగరం: పైడితల్లి జాతర మహోత్సవాలు పురస్కరించుకుని, భక్తులకు పంపిణీ చేసే లడ్డూ ప్రసాదం తయారీని ఫుడ్ కంట్రోల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. నగరంలోని శివాలయం వీధిలో ఉన్న అమ్మవారి కల్యాణ మండపంలో ఈ నెల 30, 31వ తేదీల్లో పైడితల్లి జాతర మహోత్సవం నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా భక్తులకు విక్రయించే లడ్డూ ప్రసాదంలో వినియోగిస్తున్న శనగపప్పు, నూనెతో పాటు తయారీ ప్రక్రియను జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నాగుల్ మీరాలు చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాలతో ప్రసాదం తయారీ జరుగుతోందన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


పూసపాటిరేగ: వెల్దూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని వెలుదూరు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆయన చేతుల మీదుగా పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం అక్కడి పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించిన ఆయన ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే సదుద్దేశ్యంతోనే ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతీ పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రస్తుతం వైద్య శిబిరాల్లో వివిధ రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా విలువైన మందులు కూడా అందజేయడం జరుగుతోందన్నారు. గ్రామీణులకు కూడా తక్షణ, నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ధ్యేయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలోనే ప్రజలకు వైద్యసేవలందేలా వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, 104 అంబులెన్స్‌లు, ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే నాడు-నేడు కింద పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా కేంద్రాస్పత్రులను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, నాయకులు మహంతి జనార్దనరావు, ఎస్.సత్యనారాయణరాజు, దారపు గున్నారెడ్డి, దారపు అప్పలసూరెడ్డి, లంకలపల్లి గాయత్రి, నాయిని సత్యవతి, వల్లంశెట్టి నాగార్జున, తహసీల్దారు ఇ.భాస్కరరావు, ఎంపీడీవో ఎం.రాధిక, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం..

భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గూడెపువలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి శుక్రవారం వెళ్లిన ఆయన ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం అక్కడి అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి, పౌష్టికాహార పదార్థాలను రుచి చూశారు. ప్రతీ పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యం, ఉచితంగా మంచి మందులు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రజోపయోగ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి,, తహసీల్దారు చింత బంగారాజు, ఎంపీడీవో అప్పలనాయుడు, వైద్యులు తిరుపతిస్వామి, సత్యనారాయణ, సత్యవతి, సునీల్‌కుమార్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల రూరల్: రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుధారాణి, జెడ్పీటీసీ సన్యాసినాయుడు


నెల్లిమర్ల రూరల్: వల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అందిస్తున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

జగనన్న ఆరోగ్య సురక్ష చరిత్రాత్మకం..

నెల్లిమర్ల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని వల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి వైద్యులతో మాట్లాడి, ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం రోగులతో మాట్లాడి, వైద్యులు అందిస్తున్న సేవలపై వారి అభిప్రాయాలను సేకరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తోందన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే సీఎం జగనన్న ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నిపుణులైన వైద్యులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందజేయడం జరుగుతోందన్నారు. అనంతరం రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ పప్పల బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మందుల కిట్ల పంపిణీ..

విజయనగరం: నగరంలోని వీటీ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, చిక్కాల వీధిలోని ఆర్‌కే పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చందక శ్రీనివాసరావు, రేగాన రూపాదేవి, బొంగ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు

- ఎస్పీ ఎం.దీపికా పాటిల్


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

విజయనగరం క్రైమ్: రక్తదాతలే ప్రాణదాతలని, రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని ఎస్పీ ఎం.దీపికా పాటిల్ కోరారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని, జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె సందర్శించి, కాసేపు మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర రక్తస్రావమై రక్తం అవసరమైన వారు, ఇతర అనారోగ్య పరిస్థితుల కారణంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను దృష్టిలో ఉంచుకుని, వారికి రక్తం అందించాలన్న సదుద్దేశ్యంతో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. రక్తదానంపై ఎంతోమందికి అపోహలు ఉన్నాయని, వాటిని విడనాడాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. విద్యార్థులు, యువతీయువకులు రక్తదానానికి ముందుకు రావాలన్నారు. మనమిచ్చే రక్తం ఒకరి ప్రాణం కాపాడడమే కాకుండా ఆ కుటుంబానికి అండగా నిలిచిన వారమవుతామన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం సబ్ డివిజన్ పరిధిలో పనిచేసే పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుళ్లు, ఎన్‌సీసీ సిబ్బంది పాల్గొని, రక్తం దానం చేశారు. రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందికి ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు అస్మా ఫర్హీన్, ఎస్.వెంకటరావు పండ్లు, ఫ్రూట్ జ్యూస్‌లు, బిస్కట్లు అందజేశారు. మొత్తం 50 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, రోటరీ క్లబ్ కోశాధికారి ప్రవీణ్‌కుమార్ అంచాలియా, సీఐలు నరసింహమూర్తి, బి.నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు సుబ్బరాజు, సత్యం, భోగరాజు సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంటపాత్రల పంపిణీ

నెల్లిమర్ల: మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి, మండలంలోని 68 ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన వంట పాత్రలను శుక్రవారం పంపిణీ చేసినట్లు ఎంఈవో యు.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు ఇప్పుడు నాణ్యమైన పాత్రలను కూడా ప్రభుత్వం అందజేసిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి సన్నిధిలో అవనాపు విక్రమ్ దంపతులు


పైడితల్లిని దర్శించుకుంటున్న అవనాపు విక్రమ్ దంపతులు

విజయనగరం టౌన్: స్థానిక పైడితల్లి ఆలయంలో అమ్మవారిని ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్‌పర్సన్ అవనాపు భావన, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు అవనాపు దంపతులకు అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు.

గ్యారవీ షరీఫ్ ఉత్సవాలు ప్రారంభం

విజయనగరం టౌన్: జిల్లా వ్యాప్తంగా పవిత్రమైన గ్యారవీ షరీఫ్ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నవంబరు 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని గౌస్ మస్తాన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కె.చిష్టి ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉత్సవాలు పురస్కరించుకుని, మస్తాన్ వీధిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

చీరల వితరణ

విజయనగరం టౌన్: స్థానిక ప్రేమసమాజంలోని వృద్ధులకు చిన్మయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చీరలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ యనమండ్ర సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వారికి సేవ చేస్తేనే దేవుని ఆశీస్సులు లభిస్తాయన్నారు. అనంతరం వంద మందికి పైగా వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కంది మురళీనాయుడు, శంబర లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఎస్పీ ఎం.దీపికా పాటిల్


వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

విజయనగరం క్రైమ్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ ఎం.దీపికా పాటిల్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని, జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ శక్తివంచన లేకుండా పనిచేస్తూ, ఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోవడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అంతేకాకుండా ఒక్కోసారి ఆరోగ్యపరమైన సమస్యలతో విధి నిర్వహణలో సైతం ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మావోయిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను నిత్యం స్మరించుకుంటూ స్ఫూర్తి పొందాలన్నారు. తిరుమల మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో పోలీస్ కుటుంబాలు, సామాన్య ప్రజానీకానికి ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్యసేవలు అందించాలన్నారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన మొత్తం 80 మందికి వైద్య తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో తిరుమల నర్సింగ్ హోమ్ ఎండీ తిరుమల ప్రసాద్, వైద్యులు మహేష్, వి.ఎస్.పద్మకుమార్, జీవిత, అశ్విని, అన్వర్, అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, సెబ్ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, సీఐలు ఇ.నరసింహమూర్తి, జె.మురళి, బి.నాగేశ్వరరావు, ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

నెల్లిమర్ల: విలువలతో కూడిన విద్యనందించాలని వైఎస్సార్ సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూర్లె శ్రీధర్ అన్నారు. స్థానిక పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో దాట్ల ఫౌండేషన్(హైదరాబాద్) సహకారంతో నూతనంగా నిర్మించిన భవనాలను కందర్ప మురళీకృష్ణ, కృష్ణంరాజు తదితరులతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలల్లో విద్యతో పాటు భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు నేర్పించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు


విజయనగరంలోని ఓ హోటల్‌లో వంట గదిలో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి

విజయనగరం: నగరంలోని పలు హోటళ్లు, చికెన్ సెంటర్లు, తినుబండారాల దుకాణాల్లో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓ హోటల్‌లో అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించిన ఆయన సదరు యజమానిని హెచ్చరించారు. రుచికరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో తినుబండారాలను తయారు చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఈగలు, దోమలు లేకుండా ఎప్పటికప్పుడు హోటళ్లు, తినుబండారాల దుకాణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పటికప్పుడు తయారు చేసిన పదార్థాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. నిల్వ ఉన్న పదార్థాలను విక్రయించినట్లు గమనిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని ఓ ప్రధాన హోటల్‌లోని ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న పదార్థాలను ఆయన గమనించారు. తినిబండారాలను నిల్వ ఉంచి, మరల వాటిని వేడి చేసి విక్రయించడం పట్ల మండిపడ్డారు. ఇదే పరిస్థితి పునరావృతమైతే క్షమించేది లేదన్నారు. పైడితల్లి సిరిమానోత్సవానికి విచ్చేసే భక్తజనానికి పరిశుభ్రమైన ఆహారం అందివ్వాలని, ఎక్కడైనా తినుబండారాల స్వచ్ఛతలో లోపం ఉన్నట్లు సమాచారం వస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పైడితల్లికి ఘటాలతో నివేదన


ఘటాలతో ర్యాలీగా చదురుగుడికి బయలుదేరి వెళ్తున్న పైడిమాంబ దీక్షాపరులు, భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీపైడితల్లి అమ్మవారికి పైడిమాంబ దీక్షాపరులు, భక్తులు శుక్రవారం వేకువజామున ఘటాలతో నివేదన చేశారు. పైడిమాంబ దీక్షా ఆదిపీఠం నుంచి తొలి ఘటాన్ని సిరిమాను అధిరోహకులు బంటుపల్లి వెంకటరావు ఘటాన్ని ఎత్తుకుని, ర్యాలీని ప్రారంభించారు. వందలాది మంది దీక్షాపరులు ఘటాలను పట్టుకుని, శివాలయం వీధిలోని దీక్షా పీఠం నుంచి పార్కు గేటు, కమ్మవీధి, చిక్కాల వీధి, అంబటి సత్రం, మూడు లాంతర్ల జంక్షన్ మీదుగా చదురుగుడికి చేరుకుని, పైడితల్లికి ఘటాలు సమర్పించారు. పైడితల్లి అమ్మవారి దీక్షా పీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రంజిత్, వేదమూర్తి, లక్ష్మణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు


డెంకాడ: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

డెంకాడ: మండలంలోని పినతాడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ-క్రాప్ నమోదులో ఏవైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 29వ తేదీలోగా ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి రామారావు తెలిపారు. ప్రతీ రైతు తాము పండిస్తున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని, వీటి వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పంటల బీమా, ప్రభుత్వ నష్టపరిహారం వంటివి అందుతాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ ఒమ్మి హరికృష్ణ, ఏఈవో బి.రామకోటి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి రామారావు మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలతో పాటు పంటలు రకాలపై ఆరాతీసి, ఈ-క్రాప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ హరికృష్ణ, సర్పంచ్ ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- ఎలక్టోరల్ రోల్స్-2024 డ్రాఫ్ట్ ప్రచురణ
- జిల్లాలో 15,17,365 మంది ఓటర్లు
- ఓటర్లలో పురుషులు 7,50,056 మంది, మహిళలు 7,67,207 మంది, థర్డ్‌జెండర్ 102 మంది
- డిసెంబర్ 9వ తేదీలోగా అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ
- కలెక్టర్ నాగలక్ష్మి


వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాకు సంబంధించి, ఫొటో ఎలక్టోరల్ రోల్స్-2024 ఓటర్ల స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి.ఎస్ శుక్రవారం విడుదల చేశారు. దీనికి సంబంధించిన ఓటర్ల జాబితా సీడీ..లను నియోజకవర్గాల వారీగా వివిధ రాజకీయ పార్టీ ల ప్రతినిధులకు అందజేశారు. గణాంకాలు పరిశీలిస్తే పురుషుల కన్నా మహిళా ఓటర్లు 17,151 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లాకు చెందిన 7 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 15,17,365 మంది ఓటర్లు నమోదయ్యారు. ఓటర్లలో పురుషులు 7,50,056 మంది, మహిళలు 7,67,207 మంది, థర్డ్‌జెండర్ 102 మంది ఉన్నారు.

2024 జనవరి 5న తుది జాబితా..

ఓటర్ల జాబితాలో ఏవైనా క్లెయిమ్స్, అభ్యంతరాలుంటే డిసెంబరు 9వ తేదీలోగా తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ 26వ తేదీలోగా డిస్పోసల్ ఆఫ్ క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ చేస్తామన్నారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. అర్హులై ఉండి, ఎవరి పేరైనా ఓటరు జాబితాలో లేకపోయినా, ఆన్‌లైన్ ద్వారా కూడా క్లెయిమ్స్, అభ్యంతరాలు తెలియజేయవచ్చు. తొలగింపుపై నవంబరు 4, 5వ తేదీలు, డిసెంబర్ 2, 3వ తేదీల్లో నాలుగు రోజుల పాటు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జేసీ మయూర్ అశోక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొంటారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా				
నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
రాజాం	2,19,246	1,10,606	1,08,613	27
బొబ్బిలి	2,25,402	1,11,544	1,13,848	10
చీపురుపల్లి	2,02,259	1,01,258	1,00,992	9
గజపతినగరం	2,00,889	98,630	1,02,254	5
నెల్లిమర్ల	2,08,402	1,03,343	1,05,054	5
విజయనగరం	2,43,186	1,18,412	1,24,735	39
ఎస్.కోట	2,17,981	1,06,263	1,11,711	7
మొత్తం	15,17,365	7,50,056	7,67,207	102

నేడు డ్వాక్రా బజార్ ప్రారంభం

విజయనగరం అర్బన్: స్థానిక ట్యాంక్‌బండ్ రోడ్డును ఆనుకుని, ఉన్న మాన్సాస్ గ్రౌండ్‌లో డ్వాక్రా బజార్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా శనివారం ప్రారంభించనున్నారు. అఖిల భారత డ్వాక్రా బజార్ పేరిట దేశ వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయాలు దీనిలో జరగనున్నాయి. సరస్ (సేల్స్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిషన్ సొసైటీ) పరిధిలోని వివిధ రాష్ట్రాలు, రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులతో 250 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. పైడితల్లి అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాలు సందర్భంగా కేంద్ర ప్రభుత్వంతో పాటు నాబార్డు, మెప్మా, సేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిడ్బి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల సహకారంతో ప్రతిష్టాత్మక సరస్-2023 ప్రదర్శనను పెద్దచెరువు గట్టు కింద రోడ్డును ఆనుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కృత్రిమ హాలులో నవంబరు 8వ తేదీ వరకు ఉంచుతారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుంది.

ప్రదర్శన వస్తువులు ఇవే..

ఎగ్జిబిషన్‌లో వెదురు ఉత్పత్తులు, వస్త్ర ఉత్పత్తులు, చీరలు, జ్యూవెలరీ, హ్యాండ్ లూమ్, డ్రైఫ్లవర్స్, హ్యాండీ క్రాఫ్ట్, బెడ్ షీట్స్, గృహాలంకరణ వస్తువులు, హ్యాండ్ లూమ్స్, కుర్తాలు, రెడీమేడ్ దుస్తులు, హ్యాండీ క్రాఫ్ట్, ఆభరణ వస్తువులు, మసాలా దినుసులను ప్రదర్శిస్తారు. అలాగే కార్పెట్లు, డ్రైఫ్రూట్స్, ఆర్టిఫిషియల్ జ్యూవెలరీ, హ్యాండ్లూమ్స్ ఉత్పత్తులు, జ్యూట్ డోర్ల ఉత్పత్తులు, పోచంపల్లి, గద్వాల్ వస్త్రాలు అందుబాటు ధరల్లో లభిస్తాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రుచులతో పాటు ఇతర రాష్ట్రాల సంప్రదాయక వంటకాలతో ఫుడ్ కోర్టులు, మరోవైపు సందర్శకుల పిల్లలను ఆహ్లాదపరిచేందుకు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది.